తెలంగాణ

# వెన్నెల వాక్కు

జాతీయ దినపత్రిక

TELANGANAVENNELA WAKKU

TGTEL/25/A0871



తెలంగాణ వెన్నెల వాక్కు జాతీయ దినపత్రిక TGTEL/25/A0871 TELANGANAVENNELA WAKKU

విలేకరులు కావలెను

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం

మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం

7386173123 నంబర్‌ను సంప్రదించండి..

డి. యోగేష్ కుమార్, సీఈవో



హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక :58 | 12-09- 2026 | శనివారం | పేజీలు: 4 | వెల:03/-


# మోదీ--పుతిన్ భేటీ..

## ఉక్రెయిన్ యుద్ధంపై కీలక చర్చలు

- శాంతి మార్గమే పరిష్కారమన్న మోదీ..
- భారత్ ఆందోళనలను గౌరవిస్తామన్న పుతిన్




న్యూఢిల్లీ బ్యూరో:

భారత్--రష్యా సంబంధాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య జరిగిన భేటీ అంతర్జాతీయ రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం సందర్భంగా ఇరువురు నేతలు సుమారు 45 నిమిషాల పాటు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ పరిణామాలు, ప్రాంతీయ భద్రత, ఆర్థిక సహకారం, భారత్--రష్యా సంబంధాలపై విస్తృతంగా చర్చించినట్లు సమాచారం.

ఉక్రెయిన్ యుద్ధంపైనే ప్రధాన దృష్టి

రష్యా--ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం ఈ సమావేశంలో ప్రధాన అంశంగా నిలిచింది.

యుద్ధంతో సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించదని ప్రధాని మోదీ స్పష్టం చేసినట్లు తెలిసింది. హింసకు బదులుగా చర్చలు, దౌత్యపరమైన సంప్రదింపుల ద్వారానే శాంతిని సాధించగలమని ఆయన పేర్కొన్నట్లు సమాచారం.

ప్రపంచంలో శాంతి, స్థిరత్వాన్ని భారత్ ఎప్పుడూ కోరుకుంటుందని మోదీ మరోసారి స్పష్టం చేసినట్లు తెలిసింది.

రక్తపాతంతో పరిష్కారం సాధ్యం కాదు

యుద్ధ వాతావరణం ప్రపంచ దేశాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని మోదీ ప్రస్తావించినట్లు సమాచారం.

ముఖ్యంగా ఇంధన సరఫరాలు, ఆహార భద్రత, నిత్యావసర వస్తువుల ధరలపై యుద్ధ ప్రభావం పడుతోందని ఆయన పేర్కొన్నట్లు తెలిసింది.

ఉద్రిక్తతలను తగ్గించేందుకు, శాంతి స్థాపన ప్రక్రియకు భారత్ తన వంతు

2

# జనగణనలో కులగణన చేర్చాల్సిందే

## అసెంబ్లీలో భట్టి విక్రమార్క ఫైర్..

## కేంద్రం వైఖరిపై స్పష్టత ఇవ్వాలని



హైదరాబాద్ బ్యూరో:

దేశంలో శతాబ్దాలుగా కొనసాగుతున్న సామాజిక అసమానతలను తొలగించాలంటే జాతీయ జనగణనలో కులగణనను తప్పనిసరిగా చేర్చాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు.

తెలంగాణ శాసనసభలో జాతీయ జనగణన, కులగణనపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. బలహీన, వెనుకబడిన వర్గాలకు రాజ్యాంగబద్ధమైన న్యాయం అందాలంటే కులగణన కీలకమని స్పష్టం చేశారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కీలకం

దేశ జనాభాలో మెజారిటీగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల సామాజిక, ఆర్థిక సాధికారతకు కులగణన ఎంతో అవసరమని భట్టి పేర్కొన్నారు.

ఏ వర్గానికి ఎంత జనాభా ఉంది? వారికి లభిస్తున్న వాటా ఎంత? ఎక్కడ అసమానతలు

2

# హారతి కర్పూరంలా భూములు కాజేస్తుండు:

## సీఎంపై కేటీఆర్ సంచలన ఆరోపణలు



హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో భూ దోపిడీ విపరీతంగా పెరిగిపోయిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హారతి కర్పూరంలా ప్రజల భూములను కాజేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో 22ఏ నిషేధిత భూముల సమస్యలపై బాధితులు మరియు పార్టీ ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు.

శాసనసభలో కాంగ్రెస్ ప్రభుత్వ భూ భాగోతాలు మరియు అవినీతి అక్రమాలు ఎక్కడ బయటపడతాయోననే తీవ్ర భయంతోనే తమ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఉద్దేశపూర్వకంగా సస్పెండ్ చేయించి, మెడ పట్టి బయటకు గెంటేశారని కేటీఆర్ మండిపడ్డారు.

తెలంగాణలో ప్రస్తుతం ఇందిరమ్మ రాజ్యం కాదని, భూ బకాసురుల రాజ్యం నడుస్తోందని విమర్శించారు.

అటవీ ప్రాంతంలో స్మగ్లింగ్ చేసే వీరప్పన్ అటవీ శాఖ మంత్రి అయితే ఎలాంటి పరిస్థితి దాపురిస్తుందో, గతంలో ఆర్టీఐని అడ్డం పెట్టుకుని బ్లాక్‌మెయిల్ దందాలు నడిపిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయితే రాష్ట్రంలో భూముల పరిస్థితి అలాగే తయారైందని కేటీఆర్ తీవ్ర స్థాయిలో

5

# కొండా సురేఖకు మీనాక్షి నటరాజన్ ఫోన్

## అసెంబ్లీ సమావేశాల వేళ కీలక పరిణామం:





హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ శాసనసభ సమావేశాలు అత్యంత కీలకమైన ప్రజా సమస్యలపై మరియు వివిధ సవరణ బిల్లులపై శరవేగంగా సాగుతున్న సమయంలో అధికార కాంగ్రెస్ పార్టీ అంతర్గత వర్గాల్లో తీవ్ర ఉత్కంఠను రేకెత్తించిన ఒక ముఖ్యమైన పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర అటవీ, దేవాదాయ మరియు పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖకు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ నేరుగా ఫోన్ చేసి సుదీర్ఘంగా మాట్లాడటం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

శాసనసభ వేదికగా మరియు బయట చోటుచేసుకుంటున్న తాజా రాజకీయ పరిణామాలు, అసెంబ్లీలో ప్రతిపక్షాల విమర్శలను సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు అనుసరించాల్సిన వ్యూహాలు మరియు సొంత పార్టీలోని అంతర్గత పరిణామాలు మరియు వర్గపోరు అంశాలపై వీరిద్దరి మధ్య వివరంగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది.

శాసనసభ సమావేశాలు జరుగుతున్న అత్యంత కీలకమైన సమయంలోనే అధిష్ఠానం ప్రతినిధి అయిన రాష్ట్ర ఇన్‌ఛార్జ్ స్వయంగా ఫోన్ చేసి మాట్లాడటంతో గాంధీ భవన్ మరియు కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఈ సంభాషణ అత్యంత

5

# తెలంగాణలో నాన్-డెయిరీ, కృత్రిమ పనీర్‌పై ఏడాది పాటు నిషేధం




హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత కీలకమైన మరియు సంచలన నిర్ణయం తీసుకుంది. పాలతో ఎలాంటి సంబంధం లేకుండా రసాయనాలు, వృక్ష సంబంధిత కొవ్వులు, వంటనూనెలు, స్టార్చ్ మరియు ఇతర కృత్రిమ పదార్థాలతో తయారుచేసే నాన్-డెయిరీ లేదా అనలాగ్ పనీర్ (ఇాఋశ్రీశీస్త్రబవ ఃఋఅవవతీ) తయారీ, నిల్వ, పంపిణీ మరియు విక్రయాలపై ఏడాది పాటు పూర్తిస్థాయి నిషేధం విధిస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

ఆహార భద్రత మరియు ప్రమాణాల చట్టం 2006లోని నిబంధనల ప్రకారం తెలంగాణ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ స్టాండర్డ్స్ అథారిటీ కమిషనర్ ఈ నిషేధాజ్ఞలను జారీ చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ఈ ఆంక్షలు తక్షణమే అమల్లోకి వచ్చి, ఏడాది కాలం పాటు రాష్ట్రవ్యాప్తంగా నిరంతరాయంగా వర్తిస్తాయి.

ఇటీవల కాలంలో హైదరాబాద్ నగరం పరిధితో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆహార భద్రతా అధికారులు విస్తృతంగా నిర్వహించిన తనిఖీల్లో భారీగా నకిలీ, కల్తీ పనీర్ లభ్యమైంది. స్వచ్ఛమైన పాలతో తయారుచేసిన అసలైన డెయిరీ పనీర్ పేరుతో హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు మరియు వ్యాపార సముదాయాల్లో ఈ రసాయనిక పనీరును విచ్చలవిడిగా విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. తక్కువ ధరకు లభించే నాణ్యతా ప్రమాణాలు లేని నూనెలు, వివిధ రకాల రసాయనాలు మరియు నిల్వ ఉంచే పదార్థాలను ఉపయోగించి తయారుచేసే ఈ నాన్-డెయిరీ పనీర్ వల్ల ప్రజారోగ్యానికి తీవ్ర విఘాతం కలుగుతోందని స్పష్టం చేశారు.

ముఖ్యంగా ఈ తరహా కల్తీ పనీర్‌ను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల చిన్న పిల్లలతో పాటు పెద్దవారిలో కూడా జీర్ణకోశ వ్యాధులు, గుండె సంబంధిత సమస్యలు, కాలేయ రుగ్మతలు మరియు దీర్ఘకాలిక ఆరోగ్య

5

# కమిషన్ టెండర్ల పేరుతో ప్రజాధనం దుర్వినియోగానికి కుట్ర:

## జలమండలి ధర్నాలో మందాల బాలకృష్ణ రెడ్డి సంచలన వ్యాఖ్యలు




5

# ఇంటి గడపకు అంతటి ప్రాధాన్యం ఎందుకు?

ఇంట్లోకి అడుగు పెట్టేటప్పుడు మనం గడపను పెద్దగా పట్టించుకోం. బయట నుంచి వచ్చాం.. తలుపు తెరిచాం.. లోపలికి వెళ్లిపోయాం. కానీ మన పూర్వీకుల ఇళ్లలో గడపకు మాత్రం ప్రత్యేకమైన స్థానం ఉండేది. గడపను దాటేటప్పుడు కొన్ని ఆచారాలు పాటించేవారు. పండుగ రోజుల్లో గడపకు పసుపు రాసేవారు. ముగ్గులు వేసేవారు. పూజలు, శుభకార్యాల సమయంలో గడపను ప్రత్యేకంగా అలంకరించేవారు. అసలు ఇంట్లోని ఒక చిన్న భాగానికి ఇంతటి ప్రాధాన్యం ఎందుకు ఇచ్చారు?

గడప అనేది ఇంటి నిర్మాణంలో ఒక భాగమే అయినా.. మన సంప్రదాయంలో అది ఒక ప్రతీకగా మారింది. బయట ప్రపంచం నుంచి ఇంట్లోకి అడుగుపెట్టే సరిహద్దు అది. బయట ఉన్న పనులు, ఒత్తిళ్లు, ఆందోళనలు ఇంట్లోకి రాకుండా.. ఇంట్లో ఉన్న ప్రేమ, ఆప్యాయత బయటకు వెళ్లకుండా ఉండాలనే భావనను కూడా గడపకు అనుసంధానించారు.

పూర్వం ఇంటి గడప దగ్గర ముగ్గు వేయడం కేవలం అలంకారం కోసం మాత్రమే కాదు. ఉదయం ఇంటి ముందు శుభ్రం చేసి ముగ్గు వేయడం ద్వారా రోజు ఒక మంచి ఆలోచనతో ప్రారంభమవుతుందని భావించేవారు. పసుపు, కుంకుమతో గడపను అలంకరించడం శుభానికి సూచికగా భావించారు. ఇంట్లోకి అడుగుపెట్టే ప్రతి ఒక్కరికీ ఆ ఇల్లు ఒక ఆతిథ్య భావనను కలిగించేలా ఉండేది.

మన సంప్రదాయంలో గడపను తొక్కకూడదని పెద్దలు చెప్పేవారు. చిన్నపిల్లలు అలా చేస్తే వెంటనే మందలించేవారు. దీనిని కేవలం భయపెట్టే ఆచారంగా చూడాల్సిన అవసరం లేదు. ఇంటి ప్రవేశాన్ని గౌరవంగా చూడాలి.. ఇంటి పవిత్రతను గుర్తు పెట్టుకోవాలి అనే సంస్కార భావన కూడా దాని వెనుక ఉంది.

ఇంకో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. పూర్వం ఇంటి గడప దగ్గరే పెద్దలు కూర్చుని మాట్లాడేవారు. ఇంటికి వచ్చిన అతిథిని అక్కడే పలకరించేవారు. పొరుగువారితో ఆప్యాయంగా మాట్లాడేవారు. అంటే గడప కేవలం ఇంటి లోపలికి, బయటికి వెళ్లే మార్గం కాదు.. మనుషుల మధ్య సంబంధాలకు కూడా ఒక వేదికగా ఉండేది.

ఈ రోజుల్లో పెద్ద పెద్ద ఇళ్లు వచ్చాయి. అందమైన తలుపులు వచ్చాయి. ఆధునిక అలంకరణలు వచ్చాయి. కానీ గడపకు ఉన్న ఆ భావం మాత్రం క్రమంగా తగ్గిపోయింది. ఇంట్లోకి వచ్చిన వ్యక్తిని పలకరించే సమయం తగ్గింది. పొరుగింటి వారితో మాట్లాడే అలవాటు తగ్గింది. ఇంటి ముందు కాసేపు కూర్చునే సంస్కృతి కూడా కనుమరుగవుతోంది.

గడప మనకు మరో గొప్ప విషయాన్ని గుర్తు చేస్తుంది. ఇంట్లోకి అడుగు పెట్టేటప్పుడు బయట ప్రపంచాన్ని కొంతసేపు బయటే వదిలేయాలి. కార్యాలయంలో జరిగిన కోపాన్ని ఇంట్లోకి తీసుకురావద్దు. బయట ఎదురైన అవమానాన్ని కుటుంబ సభ్యులపై చూపించవద్దు. అలాగే ఇంటి ప్రేమను బయట ప్రపంచంలోకి తీసుకెళ్లి ఇతరులపై ఆధిపత్యంగా మార్చకూడదు. గడప అనేది భౌతిక సరిహద్దు మాత్రమే కాదు.. మన ప్రవర్తనకు కూడా ఒక సరిహద్దు కావాలి.

అందుకే పూర్వీకుల ఆచారాలను కేవలం మూఢనమ్మకాలుగా కొట్టిపారేయడం కూడా సరైంది కాదు. ప్రతి ఆచారానికి ఒకే కారణం ఉండకపోవచ్చు. కొన్ని ఆచారాలకు ఆధ్యాత్మిక భావం ఉంటుంది.. కొన్ని సామాజిక ప్రయోజనం కలిగి ఉంటాయి.. మరికొన్ని కుటుంబ క్రమశిక్షణను నేర్పుతాయి. వాటి వెనుక ఉన్న మంచిని అర్థం చేసుకుని కొనసాగించడం మన బాధ్యత.

ఈ రోజు మనం ఇంటి తలుపు తెరిచి లోపలికి వెళ్తున్నప్పుడు ఒకసారి గడపను గమనిస్తే.. అది ఒక చిన్న ప్రశ్న అడుగుతున్నట్టుగా ఉంటుంది ---
"బయట ఎలా ఉన్నావో అది ముఖ్యం కాదు.. ఇంట్లోకి అడుగు పెట్టిన తర్వాత నువ్వు ఎలా ఉంటావు?"

ఇంటికి బయట మనిషి ఎంత పెద్దవాడైనా కావచ్చు. కానీ గడప దాటిన తర్వాత అతను భర్త, భార్య, తండ్రి, తల్లి, కొడుకు, కూతురు, అన్న, చెల్లెలు.. ఒక బంధంగా మారిపోతాడు. ఆ బంధాల విలువను కాపాడినప్పుడే ఇల్లు నిజమైన గృహంగా మారుతుంది.

గడపను పసుపుతో అలంకరించడం ఒక ఆచారం కావచ్చు.. కానీ ఇంట్లోకి అడుగు పెట్టే ముందు మన కోపాన్ని, అహంకారాన్ని, బయట ప్రపంచపు ఒత్తిడిని గడప దగ్గరే వదిలేయడం అంతకంటే గొప్ప ఆచారం. ఇంటి గడపను గౌరవించడం అంటే కేవలం ఒక రాయిని లేదా చెక్కను గౌరవించడం కాదు.. ఆ గడప దాటిన తర్వాత మన కోసం ఎదురుచూస్తున్న బంధాలను గౌరవించడం.



సీనియర్ జర్నలిస్ట్ యోగేష్ కుమార్

## ఉత్తమ ఉపాధ్యాయునికి ఘన సన్మానం



ముధోల్, సెప్టెంబర్ 11(తెలంగాణ వెన్నెల వాక్కు ):ముధోల్ మండలంలోని బ్రాహ్మణ గావ్ ఎం పిపి ఎస్ పాఠశాల ఉపాధ్యాయులు సూర్యవంశీ మారుతి మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం బాసర మండలంలోని కీర్గుల్ గ్రామానికి చెందిన మిత్ర బృందం ఆధ్వర్యంలో ఆయనను, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అంకితభావంతో పాఠశాల రూపురేఖలు మార్చి, విద్యార్థుల సంఖ్యను పెంచినందుకు గ్రామస్తులు మరోతి ని అభినందించారు. ఈ కార్యక్రమంలో మిత్రలుప్రతాప్, సాయికుమార్, గంగాధర్, దత్త రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉక్రెయిన్ యుద్ధంపై కీలక చర్చలు

సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందని మోదీ స్పష్టం చేసినట్లు సమాచారం. భారత్ వ్యక్తం చేస్తున్న ఆందోళనలను తాము గౌరవిస్తున్నామని పుతిన్ పేర్కొన్నట్లు తెలిసింది.

బంధం మరింత బలోపేతం

ఉక్రెయిన్ అంశంతో పాటు భారత్--రష్యా మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న వ్యూహాత్మక భాగస్వామ్యంపైనా ఇరువురు నేతలు చర్చించారు.

రక్షణ రంగంలో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో భాగస్వామ్యాన్ని పెంచుకోవడంపై దృష్టి సారించినట్లు సమాచారం.

ఉమ్మడి రక్షణ పరికరాల తయారీ, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, ఇంధన భద్రత వంటి అంశాలు చర్చకు వచ్చినట్లు తెలిసింది.

ముడి చమురు సరఫరాపైనా చర్చ

ప్రపంచ ఇంధన మార్కెట్లో అనిశ్చిత పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రష్యా నుంచి భారత్‌కు ముడి చమురు సరఫరా కొనసాగింపుపై కూడా చర్చించినట్లు సమాచారం.

ఇంధన భద్రత విషయంలో పరస్పర సహకారాన్ని మరింత పెంచుకోవాలని ఇరువురు నేతలు అభిప్రాయపడినట్లు తెలిసింది.

వాణిజ్య లోటు తగ్గించేందుకు చర్యలు

భారత్--రష్యా మధ్య వాణిజ్య సంబంధాలను మరింత విస్తరించడంపైనా చర్చలు జరిగాయి.

భారతీయ ఉత్పత్తులకు రష్యా మార్కెట్లో మరిన్ని అవకాశాలు కల్పించడం ద్వారా ఇరు దేశాల మధ్య వాణిజ్య లోటును తగ్గించే దిశగా చర్యలు చేపట్టాలని నిర్ణయించినట్లు సమాచారం.

రూపాయి--రూబుల్ లావాదేవీలకు ప్రోత్సాహం

ఇరు దేశాల సొంత కరెన్సీల్లో వాణిజ్య లావాదేవీలను మరింత సులభతరం చేయడంపైనా చర్చించినట్లు తెలిసింది.

రూపాయి--రూబుల్ ఆధారిత చెల్లింపుల వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత పెంచుకోవాలని ఇరువురు నేతలు భావించినట్లు సమాచారం.

బహుళ ధ్రువ ప్రపంచానికి బలమైన మైత్రి

ప్రపంచ వ్యవస్థ వేగంగా మారుతున్న నేపథ్యంలో భారత్--రష్యా సంబంధాలకు మరింత ప్రాధాన్యత ఏర్పడుతోందని ఇరువురు నేతలు అభిప్రాయపడినట్లు తెలిసింది.

బ్రిక్స్ వేదికగా సభ్య దేశాల మధ్య ఆర్థిక సహకారం, పరస్పర విశ్వాసాన్ని పెంపొందించడంలో భారత్, రష్యాలు కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించినట్లు సమాచారం.

సుమారు 45 నిమిషాల పాటు సాగిన మోదీ--పుతిన్ భేటీ ఇరు దేశాల మధ్య బలమైన స్నేహానికి మరోసారి నిదర్శనంగా నిలిచింది. ఒకవైపు ఉక్రెయిన్ యుద్ధానికి శాంతియుత పరిష్కారాన్ని కోరుతూనే.. మరోవైపు భారత్--రష్యా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా ఈ భేటీ సాగినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# అంకెల్లో ప్రగతి.. బతుకుల్లో వెలితి

?భారతదేశంలో తీవ్రరూపం దాలుస్తున్న నిరుద్యోగ సమస్యను అంచనా వేయడానికి, దానిని ప్రామాణికంగా కొలవడానికి ప్రభుత్వం ఎట్టకేలకు ఒక నిర్ణీత మార్గాన్ని అన్వేషించి అమలులోకి తెచ్చినప్పటికీ, ఆ ప్రయత్నం ఏనుగును తాకి ఒక్కో భాగాన్ని మాత్రమే అర్థం చేసుకుని దాన్నే సంపూర్ణ నిజమని భావించిన అంధుల కథను తలపిస్తోంది. దేశ ఆర్థిక స్థితిగతులను, ప్రజల జీవన ప్రమాణాలను, శ్రామిక శక్తి ప్రగతిని ప్రతిబింబించాల్సిన అత్యంత కీలకమైన నిరుద్యోగ గణాంకాలు వాస్తవ పరిస్థితులకు ఆమడ దూరంలో నిలుస్తూ, కేవలం ఉపరితల పరిశీలనకే పరిమితమవుతున్నాయనే విమర్శలు ఆర్థికవేత్తల నుంచి బలంగా వినిపిస్తున్నాయి. త్రైమాసిక , వార్షిక నిరుద్యోగ నివేదికలను నెలవారీ సూచికగా మార్చాలనే భారత ప్రభుత్వ నిర్ణయం ఆర్థిక కోణం నుంచి స్వాగతించదగినదే అయినప్పటికీ, ఆ వివరాల నిధి స్వభావం, సమాచార సేకరణలో ఉన్న ప్రాథమిక లోపాలు దాని విశ్వసనీయతను నిరంతరం ప్రశ్నార్థకం చేస్తూనే ఉన్నాయి.

?ప్రస్తుతం సర్కారు ఉపయోగిస్తున్న 'ప్రస్తుత వారపు స్థితి' విధానంలోనే ప్రధాన లోపం దాగి ఉంది. ఈ పద్ధతి ప్రకారం ఒక వ్యక్తి గత ఏడు రోజులలో చేసిన ఏదో ఒక చిన్న పని ఆధారంగానే వారిని ఉపాధి పొందుతున్న వ్యక్తిగా వర్గీకరించి లెక్కల్లోకి తీసుకుంటున్నారు. ఇందులో ఒక వ్యక్తికి కేవలం ఏదేని పని లభించిందా లేదా అని మాత్రమే చూస్తున్నారు తప్ప, ఆ పని స్వభావం ఎలాంటిది, లభిస్తున్న వేతన చెల్లింపులు క్రమబద్ధంగా ఉన్నాయా, పని వాతావరణం ఎలా ఉందో, అసలు ఆ ఉద్యోగంతో ఆ కుటుంబం కనీస అవసరాలు తీరుతున్నాయా లేదా అనే అత్యంత కీలకమైన నాణ్యతా ప్రమాణాలను పూర్తిగా విస్మరిస్తున్నారు. అత్యధిక జనాభా అసంఘటిత రంగంపైనే ఆధారపడి జీవిస్తున్న మనదేశం లాంటి ఆర్థిక వ్యవస్థలో, నిరుద్యోగాన్ని కేవలం ఒక సాధారణ సంఖ్య ద్వారా సరిగ్గా విశ్లేషించడం సాధ్యం కాని పని. దశాబ్దాలుగా అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాలు శ్రామిక శక్తి పరిశోధనల ద్వారా శాశ్వత, పాక్షిక సమయ ఉద్యోగాలు, గంటల వారీ వేతనాలు, ఉద్యోగ కాలవ్యవధి, కార్మికుల వలసలు , దీర్ఘకాలిక నిరుద్యోగంపై లోతైన గృహ పరిశోధనలు చేసి పక్కా సమాచారాన్ని సేకరిస్తాయి. కానీ, భారతదేశంలో ఈ తరహా పరిణతి చెందిన పరిపాలనా వ్యవస్థలు లేకపోవడంతో పాటు, ఉన్న ప్రాథమిక సమాచార వనరులన్నీ ఎక్కడికక్కడ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి.

?ఉద్యోగుల భవిష్య నిధి, ఉద్యోగుల రాజ్య బీమా రికార్డులు, వస్తు సేవల పన్ను ఆధారిత సంస్థల వివరాలు, సంస్థాగత ఉద్యోగుల సమాచారం, తాత్కాలిక ఉపాధి వివరాలు, గ్రామీణ వేతన సూచికలను ఏకీకృతం చేసి భారతదేశ సమాచార నిధిని బలోపేతం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ, అవి ఇంకా ఒక సమగ్ర రూపానికి నోచుకోలేదు.

అన్నిటికంటే ముఖ్యంగా దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు పొట్టకూటి కోసం వలస వెళ్లే లక్షలాది మంది కార్మికుల వివరాలను ప్రస్తుత అధికారిక లెక్కింపులు ఏమాత్రం పరిగణనలోకి తీసుకోలేకపోతున్నాయి. ఇటీవలి క్రమానుగత శ్రామిక శక్తి పరిశోధన ప్రకారం పదిహేనేళ్లు పైబడిన వారిలో నిరుద్యోగ రేటు నాలుగు నెలల కనిష్ట స్థాయి అయిన ఐదు దశాంశం ఒక శాతానికి పడిపోయిందని సంబరపడటం నిజమైన ఆర్థిక పురోగతిని ప్రతిబింబించదు. ఎందుకంటే, ఆ సమీక్షా కాలమనేది దేశంలో అత్యంత బిజీగా ఉండే తొలి పంట కాలం. ఆ సమయంలో భూమి దుక్కి దున్నడం, నాట్లు వేయడం, కలుపు తీయడం వంటి వ్యవసాయ పనుల కోసం గ్రామీణ ప్రాంతాల్లో తాత్కాలికంగా కూలీలకు డిమాండ్ విపరీతంగా పెరుగుతుంది. నిర్మాణం, వ్యవసాయం, చిన్న తరహా వ్యాపారాలు, స్థానిక రవాణా రంగాలు కాలానుగుణ మార్పులకు లోనవుతాయి. ఇటువంటి కాలానుగుణ తాత్కాలిక నియామకాలను చూపి, అధికారిక రంగంలో శాశ్వత ఉద్యోగాలు పెరిగాయని భావించడం పెద్ద భ్రమ మాత్రమే అవుతుంది.

?భారతదేశంలో దాదాపు తొంబై శాతం మంది కార్మికులు ఎలాంటి ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత లేని అసంఘటిత రంగంలోనే తమ రెక్కలు ముక్కలు చేసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ రేటు ఐదు శాతం నుంచి నాలుగున్నర శాతానికి తగ్గిందని అంకెల ద్వారా చూపించడం అనేది ఉద్యోగ మార్కెట్‌లో లభించిన విజయం కానే కాదు. నిజానికి, వేరే ప్రత్యామ్నాయాలు లేక, ఆర్థిక ఇబ్బందుల వల్ల ప్రజలు అత్యల్ప ఉత్పాదకత, అత్యల్ప వేతనం కలిగిన పనుల్లో సర్దుకుపోతున్నారనే చేదు నిజాన్ని ఇది ప్రతిబింబిస్తోంది. దేశంలో తీవ్రమైన అల్ప-ఉపాధి, కంటికి కనిపించని అదృశ్య నిరుద్యోగం మూలమూలలా విస్తృతంగా వేళ్లూనుకున్నాయి. ఏటా సుమారు ముప్పై నుంచి ముప్పై ఐదు లక్షల మంది తాత్కాలిక కార్మికులు గ్రామాల నుంచి నగరాలకు వలస వెళ్తూ, పట్టణ మౌలిక సదుపాయాల రంగానికి దృశ్యమానం కాని వెన్నెముకగా నిలుస్తున్నారు. కానీ, ఈ వలస కార్మికుల వేతన పెరుగుదల, వారి పని గంటలు, ఆరోగ్య భద్రతపై లభించే సమాచారం చాలా పరిమితంగా ఉంది.

?మరోవైపు చదువుకున్న యువత ఎదుర్కొంటున్న పరిస్థితులు మరింత ఆందోళనకరంగా మారాయి. ఉన్నత విద్య, పట్టభద్రత, స్నాతకోత్తర విద్య పూర్తి చేసిన లక్షలాది మంది యువకులు తమ అర్హతకు తగిన ఉద్యోగాలు రాక, ప్రభుత్వ ప్రకటనల కోసం ఏళ్ల తరబడి వేచి చూసి విసిగిపోతున్నారు. ఉపాధి కోసం వారు వస్తువులను ఇళ్లకు చేరవేసే వాహనదారులుగా, సహాయకులుగా లేదా తాత్కాలిక కార్మికులుగా మారక తప్పడం లేదు. కాగితాల మీద వీరంతా 'ఉపాధి పొందుతున్న వారి' కిందకే వస్తున్నప్పటికీ, వారి చదువుకు, నైపుణ్యానికి తగ్గ ఉత్పాదకత కలిగిన ఉద్యోగాలు దక్కకపోవడం దేశ మానవ వనరుల సామర్థ్యాన్ని దారుణంగా వృథా చేయడమే అవుతుంది. చరవాణి అనుసంధాన ఆధారిత పనులలో పెరుగుతున్న ఈ ఉద్యోగాలకు ఎటువంటి కనీస వేతన హామీ, పింఛను లేదా వైద్య భీమా సౌకర్యాలు ఉండటం లేదు. పొద్దున లేస్తే ద్విచక్ర వాహనాల మీద తిరిగే ఈ తాత్కాలిక శ్రామికులను కూడా స్థిరమైన ఉపాధి పొందినట్లు లెక్కకట్టడం వల్లనే కాగితాల్లో నిరుద్యోగ శాతం తక్కువగా కనిపిస్తోంది.

?అందువల్ల, కేవలం అంకెల గారడీ ఆధారంగా ప్రతి నెల విడుదలయ్యే ఈ నిరుద్యోగ సమాచారం అనేది శ్రామిక శక్తిలోని శాశ్వత మార్పులను కాక, కేవలం కాలానుగుణ తారతమ్యాలను మాత్రమే ప్రతిబింబిస్తోంది. శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు పెరగడం సానుకూల పరిణామమే అయినప్పటికీ, ఆ భాగస్వామ్యాన్ని నిలకడైన, అధిక ఉత్పాదకత కలిగిన, గౌరవప్రదమైన ఉద్యోగాలుగా మార్చడమే ప్రభుత్వం ముందున్న అసలైన సవాలు.

రూపాంతరం చెందిన నూతన నివేదికలు పాత పద్ధతుల కంటే కొంత పురోగతిని చూపించినప్పటికీ, దాని నిజమైన విజయం కేవలం తరచుగా గణాంకాలను లెక్కించడంలో లేదు. దేశంలోని కోట్ల మంది కార్మికుల జీవనోపాధిని, ఉపాధి నాణ్యతను, కనీస భద్రతను యథార్థంగా అంచనా వేసే ఒక విశ్వసనీయమైన, ఆధునిక శ్రామిక శక్తి సూచికను రూపొందించడమే నేటి తక్షణ అవసరం.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

## జనగణనలో కులగణన చేర్చాల్సిందే

ఉన్నాయి? అనే విషయాలు ఖచ్చితంగా తెలుసుకోవాలంటే కులగణన జరగాల్సిందేనన్నారు.

'ఎక్స్‌రే' లాంటి సమాచారం

కులగణన సమాజానికి ఎక్స్‌రే లాంటిదని భట్టి అభివర్ణించారు.

శాస్త్రీయమైన సమాచారం అందుబాటులో ఉంటేనే ప్రభుత్వ పథకాలు, బడ్జెట్, వనరులు, అవకాశాలను జనాభా ప్రాతిపదికన సమర్థంగా కేటాయించగలమన్నారు. సరైన గణాంకాలు లేకుండా ప్రజాధనాన్ని అవసరమైన వర్గాలకు పూర్తి స్థాయిలో చేరవేయడం సాధ్యం కాదని పేర్కొన్నారు.

తెలంగాణ సర్వే దేశానికే దిక్సూచి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అంశాలపై సమగ్ర ఇంటింటి సర్వే నిర్వహించిందని భట్టి తెలిపారు.

రాష్ట్ర ప్రణాళికా శాఖ పర్యవేక్షణలో సర్వే ప్రక్రియను ప్రతిరోజూ సమీక్షించామని చెప్పారు. క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారుల వరకు అందరినీ సమాయత్తం చేసి పారదర్శకంగా సర్వే నిర్వహించినట్లు వెల్లడించారు.

కులగణన విషయంలో బీజేపీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని భట్టి విమర్శించారు. కులగణనపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి

# హమాలీ కార్మికులకు కూలీ రేట్లు పెంచాలి..

## రూ. 6 వేల పింఛన్ ఇవ్వాలి: సీఐటీయూ




కడెం, సెప్టెంబర్ 11 (తెలంగాణ వెన్నెల వాక్కు):
జిల్లాలోని హమాలీ కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీ రేట్లను పెంచాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి నెలకు రూ. 6,000 పింఛన్ అందించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ డిమాండ్ చేశారు. కడెం మండల కేంద్రంలో హమాలీ కార్మికుల సమస్యలపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా హమాలీలకు ఒకే రకమైన కూలీ రేట్లు అమలు చేయాలన్నారు. కడెం మార్కెట్లో ఎరువులు, విత్తనాల బస్తా లోడింగ్, అన్‌లోడింగ్‌కు రూ. 15 చొప్పున కూలీ చెల్లించాలని కోరారు. ప్రభుత్వాలు కార్మికుల శ్రమను దోచుకుంటూ వారి సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని మండిపడ్డారు. కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కె. లచ్చన్న, జె. మల్లేష్, జి. అంజన్న, రాజన్న, రాకేష్, విఠల్, మహేష్ పాల్గొన్నారు.

# అబ్దుల్లాపూర్‌లో చెత్త డబ్బాల పంపిణీ:

## తడి, పొడి చెత్తపై అవగాహన




లోకేశ్వరం, సెప్టెంబర్ 11 (తెలంగాణ వెన్నెల వాక్కు):
లోకేశ్వరం మండల పరిధిలోని అబ్దుల్లాపూర్ గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య మెరుగుదలకు శుక్రవారం ఇంటింటికీ చెత్త డబ్బాలను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ దడిగ జయలలిత, ఉపసర్పంచ్ సాయినాథ్ గ్రామస్తులకు డబ్బాలను అందజేసి అవగాహన కల్పించారు. నివాసాల నుంచి వెలువడే ఆహార వ్యర్థాలు, కూరగాయల తొక్కలు తడి చెత్తగా, ప్లాస్టిక్, కాగితాలు, గాజు వ్యర్థాలను పొడి చెత్తగా వేరుచేసి పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, వార్డు సభ్యులు శ్రీకాంత్, లింగారెడ్డి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# గండి రామన్న పార్కులో అటవీ అమరవీరులకు ఘన నివాళి



నిర్మల్ రూరల్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వెన్నెల వాక్కు):
జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం చించోలి సమీపంలోని గండి రామన్న అర్బన్ పార్కులో అటవీ అమరవీరుల స్థూపం వద్ద అధికారులు ఘనంగా నివాళులర్పించారు. నిర్మల్ అటవీ మండల అధికారిణి (ఎఫ్ఆర్వో) నాగిని మాను స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. విధి నిర్వహణలో అడవులు, వన్యప్రాణుల రక్షణ కోసం ప్రాణాలర్పించిన జిల్లాకు చెందిన అటవీ శాఖ అమరవీరుల కుటుంబ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అటవీ సంపదను రక్షించడమే అమరులకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాసర సర్కిల్ నిఘా విభాగం ఎఫ్ఆర్వో శివకుమార్, ఎఫ్ఆర్వో రామకృష్ణారావు, జిల్లా అటవీ క్షేత్ర అధికారులు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# వాసవి పాఠశాలలో చిన్నారులచే మట్టి వినాయకుల తయారీ




నిర్మల్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వెన్నెల వాక్కు):
వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా నిర్మల్ పట్టణంలోని వాసవి ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మట్టి వినాయక ప్రతిమలను తయారు చేయించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సుహాసిని ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా రంగురంగుల మట్టితో అందమైన బొజ్జ గణపతులను రూపొందించి ఆకట్టుకున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ రసాయన విగ్రహాలను వాడకుండా పర్యావరణానికి మేలు చేసే మట్టి గణపతులనే ప్రతిష్టించి పూజించాలని విద్యార్థులకు ప్రిన్సిపాల్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన కోఆప్షన్ సభ్యుడు

## గాజుల రవికి పరామర్శ



నిర్మల్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ఇటీవల పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నిర్మల్ మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యుడు గాజుల రవిని పలువురు ప్రజాప్రతినిధులు, కళాకారులు శుక్రవారం పరామర్శించారు. అతివేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొనడంతో రవి తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న 57 ఉపకులాల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గంధం గంగాధర్, ధూంధాం కళాకారుడు దరువు భోజన్న, ప్రముఖ గాయకుడు ఇడగనూరు దినేష్ (స్వర్ణ) ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ధైర్యం చెప్పారు.

# రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి



నిర్మల్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వెన్నెల వాక్కు):
వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలోని రైతులకు వ్యవసాయ విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా పకడ్బందీ ముందస్తు చర్యలు చేపట్టాలని టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం నిర్మల్ మండలంలోని అక్కాపూర్ 220/132/33 కేవీ సబ్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరా స్థితిగతులు, లోడ్ వివరాలు, ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరును ఉన్నతాధికారులతో కలిసి సమీక్షించారు. ఇటీవల కాలిపోయిన 50 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో హైదరాబాద్ నుండి తెప్పించిన నూతన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా అక్కాపూర్ సబ్‌స్టేషన్‌కు అదనంగా మరో 160 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను నూతనంగా మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.వ్యవసాయ ఫీడర్లపై అధిక లోడ్ పడకుండా కెపాసిటర్ బ్యాంకులను సమర్థవంతంగా వినియోగించి పవర్ ఫ్యాక్టర్‌ను క్రమబద్ధీకరించాలని సూచించారు. అత్యవసరమైతే తప్ప లైన్ క్లియరెన్స్ (ఎల్‌సీ)లు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. విధులు నిర్వహించే సమయంలో విద్యుత్ సిబ్బంది తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలు పాటించాలని, ప్రమాదాల నివారణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదన్నారు. గణేష్ చతుర్థి వేడుకల సందర్భంగా మండపాలు, ఊరేగింపు మార్గాల్లో విద్యుత్ భద్రతపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ టెక్నికల్ మెంబర్ జేఆర్ చవాన్, ఎస్ఈ రమేష్, డీఈలు నాగరాజు, తిలక్, వెంకట్రామయ్య, ఏఈలు సంజీవ్, వెంకటపతిరాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎడ్‌బిడ్ గ్రామంలో శరవేగంగా

# కళ్యాణ మండపం నిర్మాణ పనులు



ముధోల్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండల పరిధిలోని ఎడ్‌బిడ్ గ్రామంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నూతన కళ్యాణ మండప నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి . ఆగస్టు 21న శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించి ప్రారంభించిన ఈ పనుల్లో భాగంగా సెప్టెంబర్ నెలాఖరు నాటికి ప్రధాన షెడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి ఆధునిక హంగులతో పూర్తి స్థాయి కళ్యాణ మండపాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు. గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు శుభకార్యాలు, వివాహాలు జరుపుకునేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఈనెల 13 నుండి సరస్వతి కాలువకు

# సాగునీరు విడుదల: కూచాడి శ్రీహరిరావు



నిర్మల్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ నియోజకవర్గ రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎస్సారెస్పీ సరస్వతి కాలువ ద్వారా ఈనెల 13వ తేదీ (ఆదివారం) నుండి వారబందీ పద్ధతిలో సాగునీటిని విడుదల చేయనున్నట్లు నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కూచాడి శ్రీహరిరావు వెల్లడించారు. నియోజకవర్గ పరిధిలోని ఆయకట్టు పంటలు వర్షాభావంతో ఎండిపోతున్న పరిస్థితులను వివరిస్తూ శ్రీహరిరావు స్వయంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని, ఇరిగేషన్ ఈఎన్‌సీ రమేష్ బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. రైతుల సమస్యల తీవ్రతను గుర్తించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెంటనే స్పందించి, సరస్వతి కాలువ పరివాహక ప్రాంత రైతులకు సాగునీరందించేలా ఉత్తర్వులు జారీ చేయాలని ఈఎన్‌సీకి ఆదేశాలు ఇచ్చారు.
దీంతో ఈనెల 13వ తేదీ ఆదివారం నుండి సరస్వతి కాలువకు నీటిని విడుదల చేసేందుకు నీటిపారుదల శాఖ రంగం సిద్ధం చేసింది. ప్రాజెక్టులో నీటి లభ్యత పరిమితంగా ఉన్నందున రైతులు సాగునీటిని వృథా చేయకుండా ఆచితూచి సద్వినియోగం చేసుకోవాలని కూచాడి శ్రీహరిరావు కోరారు. నిర్మల్ రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యపై తక్షణమే స్పందించి సాగునీటి విడుదలకు మార్గం సుగమం చేసిన రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి, ఇరిగేషన్ ఈఎన్‌సీ రమేష్ బాబుకు ఆయన నియోజకవర్గ రైతుల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

తెలంగాణ వెన్నెల వాక్కు
TGTEL/25/A0871
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU



# సీఎం ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

## కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష.. 9వ రాష్ట్రీయ పోషణ మాసం గోడప్రతుల ఆవిష్కరణ

నిర్మల్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వెన్నెల వాక్కు):




జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలు సమర్పించిన సీఎం ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీఎం ప్రజావాణి దరఖాస్తుల పరిష్కార ప్రగతిపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న అర్జీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల మేరకు బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో పరిష్కారం కాని వినతులను తక్షణమే సంబంధిత ఉన్నతాధికారుల లాగిన్లకు పంపించాలని సూచించారు. అనంతరం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 9వ రాష్ట్రీయ పోషణ మాసం గోడప్రతులను జిల్లా సంక్షేమ అధికారిణి వినూత్నతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. అక్టోబర్ 8 వరకు సాగే పోషణ మాసంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం, ఆరోగ్య పరిరక్షణపై గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో రాథోడ్ రమేష్, ఆర్డీవో దేవీదాస్, తహశీల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఐదు రోజుల బ్యాంకింగ్ అమలు చేయాలి:

## నిర్మల్‌లో బ్యాంకు ఉద్యోగుల సమ్మె

నిర్మల్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వెన్నెల వాక్కు):




ఐదు రోజుల బ్యాంకింగ్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (ఖఫీదీఖ) పిలుపు మేరకు నిర్మల్ పట్టణంలో బ్యాంకు ఉద్యోగులు ఆల్ ఇండియా సమ్మెను విజయవంతంగా నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని ప్రధాన ఎస్‌బీఐ శాఖ ఎదుట బ్యాంకర్లు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టారు. ప్రభుత్వం తీసుకొచ్చిన వివాదాస్పద పీఎల్ఐ స్కీమ్‌ను రద్దు చేయాలని, ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని నినదించారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఈనెల 28, 29, 30 తేదీల్లో దేశవ్యాప్త సమ్మెతో పాటు అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. నిరసనలో కళాకారులు డాక్టర్ ఫిరంగి జోసెఫ్ బాబూరావు, దినేష్, సురేష్, దరువు భోజన్న విప్లవ గీతాలతో ఉద్యోగుల్లో ఉత్సాహం నింపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి. శ్రీనివాస్, శ్రీధర్, లక్ష్మణ్, పోశెట్టి మరియు వివిధ బ్యాంకుల ఉద్యోగులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న ముదిరాజ్ సంఘం నేతల ముందస్తు అరెస్ట్

లక్ష్మణచాంద, సెప్టెంబర్ 11 (తెలంగాణ వెన్నెల వాక్కు):




హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన 'ఛలో అసెంబ్లీ' ముట్టడి కార్యక్రమానికి తరలివెళ్తున్న లక్ష్మణచాంద మండల ముదిరాజ్ సంఘం నాయకులను పోలీసులు శుక్రవారం ఉదయం ముందస్తుగా అరెస్ట్ చేశారు. తమ న్యాయమైన హక్కుల సాధనకు శాంతియుతంగా నిరసన తెలపడానికి వెళ్తుంటే నిర్బంధించడం దుర్మార్గమని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముదిరాజులను తక్షణమే బీసీ–ఏ జాబితాలో చేర్చాలని, ముదిరాజ్ సంక్షేమ కార్పొరేషన్‌కు రూ. 1,000 కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉచిత చేప పిల్లల పంపిణీలో జరుగుతున్న భారీ అవినీతిని అరికట్టాలని, జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో, నామినేటెడ్ పదవుల్లో తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో బీసీ నేత ముద్రబోయిన వినేష్, మాజీ ఉపసర్పంచ్ సుంకరి శ్రీను, సిహెచ్. రాజేశ్వర్, సుంకరి సురేష్, జి.ఆర్. రవి, సిహెచ్. రాజేందర్ ఉన్నారు.

# జిల్లా ప్రధాన ఆసుపత్రిలో వైద్య సేవలు మరింత మెరుగుపరచాలి:

నిర్మల్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వెన్నెల వాక్కు):




నిర్మల్ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే నిరుపేద రోగులకు మెరుగైన, అత్యున్నత నాణ్యమైన వైద్య సేవలు అందించేలా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయంలో వైద్యాధికారులు, వివిధ విభాగాల హెచ్‌వోడీలతో కలెక్టర్ ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. రోజువారీగా నమోదవుతున్న ఓపీ వివరాలు, ఇన్‌పేషెంట్ వార్డుల్లో అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఆర్థోపెడిక్, కార్డియాలజీ, ఈఎన్‌టీ, రేడియాలజీ విభాగాల్లో అత్యవసర శస్త్రచికిత్సలకు అవసరమైన ఆధునిక పరికరాలు, యంత్రాల వివరాలను వైద్యుల నుంచి సేకరించారు. వైద్య పరికరాలను ప్రాధాన్యతా క్రమంలో త్వరలోనే సమకూరుస్తామని హామీ ఇచ్చారు. రోగులు, వారి బంధువులకు ఇబ్బంది కలగకుండా ఆసుపత్రి ప్రాంగణంలో క్రమబద్ధమైన పార్కింగ్ సౌకర్యం కల్పించాలని ఆదేశిస్తూ స్వయంగా పార్కింగ్ ప్రాంతాన్ని పరిశీలించారు. సమావేశంలో సూపరింటెండెంట్ గోపాల్ సింగ్, అధికారులు రమేష్, సరోజ, వైద్య బృందం పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి 'జిజ్ఞాస' పోటీల్లో నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ద్వితీయ స్థానం

నిర్మల్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వెన్నెల వాక్కు):

రాష్ట్ర కళాశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్ట్' రాష్ట్ర స్థాయి పోటీల్లో నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గణిత శాస్త్ర విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. కళాశాల గణిత అధ్యాపకుడు కట్టా రమేష్ రెడ్డి మార్గదర్శకత్వంలో విద్యార్థినులు ఎం. రాణి, ఎం. అక్షయ, ఎస్. అమూల్య, టి. రిషిక, ఎం. సింధుజల బృందం "హైస్కూల్ విద్యార్థుల్లో గణితం పట్ల ఆందోళన" అనే అంశంపై విస్తృత పరిశోధన జరిపి ప్రాజెక్ట్ సమర్పించారు. విద్యార్థుల్లో గణిత భయానికి గల కారణాలు, అధిగమించే మార్గాలపై చేసిన పరిశోధన న్యాయనిర్ణేతలను మెప్పించింది. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులను, ప్రాజెక్ట్ గైడ్ కట్టా రమేష్ రెడ్డిని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ యు. గంగాధర్, అధ్యాపక బృందం ఘనంగా అభినందించారు.




# పోలీస్ అమరవీరుల కుటుంబాలకు అండగా 'టీజీ వీర్ ఫ్యామిలీ కార్డులు':

## అమరవీరుల కుటుంబాలకు ప్రత్యేక కార్డులు పంపిణీ చేసిన జిల్లా ఎస్పీ

నిర్మల్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వెన్నెల వాక్కు):




సమాజ రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి కుటుంబాల సంక్షేమానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ వెన్నంటి ఉంటుందని జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల ఐపీఎస్ అన్నారు. రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ ఐపీఎస్ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అమరవీరుల కుటుంబాలకు 'టీజీ వీర్ ఫ్యామిలీ కార్డుల'ను ఎస్పీ పంపిణీ చేశారు. ప్రభుత్వం, పోలీస్ శాఖ ద్వారా అందే ఆర్థిక సహాయం, పెన్షన్లు, కారుణ్య నియామకాలు, ఇళ్ల స్థలాల కేటాయింపులు తదితర సంక్షేమ పథకాలను కేంద్రీకృత పోర్టల్ ద్వారా ట్రాక్ చేస్తూ ఎలాంటి జాప్యం లేకుండా లబ్ధి చేకూర్చడమే ఈ కార్డుల ప్రధాన లక్ష్యమని తెలిపారు. అమరుల కుటుంబాల సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తామన్నారు. కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ సాయికిరణ్, డీఎస్పీ శ్రీనివాస్, ఏవో యూనస్ అలీ, సీఐలు కృష్ణ, సమ్మయ్య, సత్యనారాయణ, ఆర్ఐలు రాంనిరంజన్, రామకృష్ణ, ఎస్సై లింబాద్రి, పోలీస్ అసోసియేషన్ నాయకులు సాయికుమార్, సాయికృష్ణ పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

ముధోల్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వెన్నెల వాక్కు):



వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ప్రజలు, యువకులు పరస్పర సహకారంతో శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ముధోల్ సీఐ రవీందర్ నాయక్ కోరారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో హిందూ ఉత్సవ సమితి, గణేష్ మండపాల నిర్వాహకులు, గ్రామ పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు శాఖ వెబ్‌సైట్‌లో ముందస్తు అనుమతులు పొందాలన్నారు. డీజేలకు అనుమతి లేదని, శబ్ద కాలుష్యం లేకుండా సంప్రదాయ పద్ధతుల్లో పూజలు నిర్వహించు కోవాలన్నారు. నిమజ్జనం వేళ ఎలాంటి ఘర్షణలు, అవాం ఛనీయ ఘటనలకు తావులేకుండా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. నిమజ్జన ప్రాంతాల్లో ముందస్తు భద్రతా జాగ్రత్తలను ఎస్సై పెర్సిస్ వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లవకుమార్, సర్పంచ్ షబానా ఎజాజుద్దీన్, ఆర్ఐ నారాయణ, బీడీసీ అధ్యక్షుడు విఠల్, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER